"చదువంటే ఈ గుమాస్తా చదువులు కాదు. మనిషిని మనిషిగా నిలబెట్టగల చదువు. నేనెవరు? నాకేం కావాలి? నా చుట్టూ ఏం జరుగుతున్నది? నా పరిస్థితి ఏమిటి? నేనేం చెయ్యాలి? అన్న ఆలోచన పుట్టించే చదువు. సమాజంయొక్క మంచిలో తన మంచి ముడిపడివుందన్న జ్ఞానం కలిగించేది. అందరం కలిసే పైకిగానీ కిందికిగానీ పోతామన్న సత్యం గ్రహింపుకు తెచ్చేది... ప్రతి ఒక్కమనిషి మంచి చెడ్డలకూ సమాజంలోని ప్రతిమనిషికీ బాధ్యత ఉన్నదనే మూలసత్యాన్ని కొంతవరకైనా గ్రహింపజేసేది..."

చలపతి మాట్లాడుతూ ఉండగానే పోతప్ప లేచాడు. వెళ్తానని చెప్పనైనా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

'ఎవరి తెలివి వారిది. ఎవరి బతుకు వారిది. పేపరు చదివే వోల్లంత వూరోల్లకి నెట్టులేదని అగుడుజెత్తన్నారా? ఈయప్ప సావాసం చాలు సామీ' అనుకున్నాడు.

## 3

వారం రోజులు చలపతి ముఖం చూడలేదు పోతప్ప. బ్రిడ్జిదగ్గర రిక్షా ఆపుకోలేదు. ఒక రోజున పోతప్ప ఆగినచోటికి చలపతే వచ్చాడు. "చాలా కోపం మీదున్నావే" అని నవ్వాడు. ఆ నవ్వుచూస్తే పోతప్పకు మండుకొచ్చింది. "ఎంత చదువుకున్నోడికైనా గొప్పోడికైనా అంతలావు పొగురు మంచిదికాదు" అన్నాడు వెటకారంగా. "నేను గొప్పోడిననుకుని ఏదీ మాటాడటంలేదు. ఎంత హీనంగా వున్నానో తెలుసుకున్నాకనే ఇవన్నీ ఆలోచించుకున్నాను" అన్నాడు చలపతి. "మాటలు బాగా పొర్లిత్తావుగానీ నాకు పనుంది పోవాల" అన్నాడు పోతప్ప. "ఆర్నెల్లబట్టి నువ్వు నాకు అన్నదమ్ముడిలాగున్నావు. ఇప్పుడు కోపం చేసుకోవద్దు. రిక్షా ఇచ్చినాక రాత్రికి మా యింటికి రా" అన్నాడు చలపతి.

'వెళ్దామా వద్దా' అని ఆలోచించుకున్నాడు పోతప్ప. ఆలోచన తెగకుండానే అన్నం తిని చలపతి ఇంటికి వెళ్ళాడు.

ఇద్దరూ మూసేసిన పార్కు ముందరి దిమ్మెమీద కూర్చున్నారు. తానుగా ఏమీ మాట్లాడకూడదనీ, చలపతి సమాజం గురించిన ఉపన్యాసాలు ఎత్తుకుంటే నోరు మూయించాలని పట్టుదలగా వున్నాడు పోతప్ప. కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా వుండిపోయారు.

"పకీరన్న మేస్త్రిని చూశావుగా... మా నాన్న అచ్చం అట్లాగే వుంటాడు" అన్నాడు చలపతి.

ఖాకీ చొక్కా ఖాకీపాంటూ వేసుకుని తలచుట్టూ మఫ్లరు చుట్టుకుని చేతులు

వేసుకున్నారు. ఆ మునిసిపాలిటీవాడికి వాళ్ళెక్కువ. వీళ్ళు తక్కువ. ఎక్కడ జూసినా అన్నేయం! అన్నేయం! బడుగువాళ్ళని ఈగల్ని తోలినట్లు తోల్తారు!

తలచుకున్నకొద్దీ పోతప్ప రెచ్చిపోయాడు. నేరుగావెళ్ళి షెడ్డు ముందు తడికెలు రెండూ వూడబీకి క్రిందికి విసిరేశాడు.

లోపల కారులేదు. శంకరరెడ్డిగారు అంతకుముందే లయన్స్‌క్లబ్ మీటింగుకి వెళ్ళారు.

ఈ పక్కా ఆ పక్కా సందుల్లోవుండే వాళ్లందరూ బయటికొచ్చారు. వీధిలో చుట్టుపక్కలవుండేవారందరూ గుంపుజేరి చోద్యం చూస్తూ నిల్చున్నారు.

"ఎందుకప్పా, వాళ్ళ షెడ్డు పీకుతున్నావ్?" అన్నారెవరో.

"అది నాది" అన్నాడు పోతప్ప రొమ్ము చరచుకుంటూ. "నీదా, ఎట్టా నీది?"

"అసలు మాదే. తొలీత మేమే ఈడుంది."

ఎవరో పరుగెత్తుకుంటూ ఎదుటి ఇంట్లోకి వెళ్ళి కల్యాణమ్మగారితో చెప్పారు. ఆమెకు ఏం చెయ్యాల్లో పాలుపోక కిటికీలోంచి చూస్తూ నిల్చుంది.

తడికెలు కట్టిన గుంజల్ని బలంగా పీకిపారేశాడు పోతప్ప. చుట్టూ వుండే జనం అవి తమమీద పడతాయేమోనని కొద్దిగా వెనక్కి జరిగారు.

"తడికెలూ గుంజలూ నీవేనా?"

"నావే."

జనాన్ని చూసినకొద్దీ పోతప్పకి ఉత్సాహం హెచ్చిపోతున్నది. తనేదో ఘనకార్యం చేస్తున్నట్లుగా ఉబ్బిపోతూ ఒక గుంజను చేత్తో పట్టుకుని, క్రిందపడున్న తడికెలమీద ఠీవిగా నిల్చున్నాడు. జనానికి ఏమి జరుగుతుందో చూద్దామన్న ఆసక్తితోపాటు వాడి ప్రవర్తనకు నవ్వూ వస్తున్నది.

"షెడ్డు వాళ్ళది. నీదెట్లా అవుతుంది?"

"ఓరి ఎర్రినాయాలా. నీదేంది? నాదేంది? ఆళ్ళదేంది? ఎవుడిచేతికొత్తే ఆడిదే సొమ్ము." కళ్ళల్లోని నీళ్ళు తుడుచుకున్నాడు. "నేను రిచ్చాదొక్కి కట్టపడి సంపాయించుకున్న దుడ్లెయ్యి? నా పొట్టేలు పిల్లలెయ్యి? సెప్పు..." ముక్కు తుడుచుకున్నాడు. తన తెలివితేటలకి ఆశ్చర్యం గర్వం కలిగాయి పోతప్పకి. చలపతి జ్ఞాపకం వచ్చాడు. "సాపకింద బురద నీల్లల్లె పరమారతావుందిరా కొత్తపద్ధతి. నీ సాప నానిపోయి కుల్లుకంపుగొడతావుందిరా... నాయం నాయం అని నాయాలు సెప్తావుండావె. యాడుంది నాయం?" చుట్టూ అందరినీ ఉరిమి చూశాడు.

ఇంతవరకూ కిటికీలోంచీ చూస్తున్న కల్యాణమ్మగారికి ఆవేశం వచ్చింది. 'ఇది ఊరా, అడివా? పట్టపగలు నట్టనడివీధిలో ఒక తాగుబోతు వెధవ పెద్దా చిన్నాలేకుండా

